# హోమ్ కమింగ్


**- వసుంధర**

"నీకు మదపిచ్చి" అంటున్నాడు బావ ఇప్పుడు. భర్తను విడిచి తనతో వచ్చేసేవని పరాకు.

"నీకు మగపిచ్చి" అనేది అమ్మ చిన్నప్పుడు. మగపిల్లలతోనే ఆడుకునేదాన్నని చిరాకు.

నాకు తెలుసు- నేను మామూలు ఆడపిల్లనేననీ నాకే పిచ్చీ లేదనీ.

నాన్నకి బాగా డబ్బుంది. అంతకుమించిన పలుకుబడి ఉంది. పైసా దానమిచ్చినా దానకర్ణుడనేటంత అభిమానమూ, మర్డర్ చేసినా వేలెత్తి చూపలేనంత భయమూ- జనానికాయనపై ఉన్నాయి. ఆయన రాజకీయాల్లో చేరకపోయినా- అవాయన చుట్టూ తిరుగుతూ సేవించుకుంటాయి.



అసలే అందగత్తెని. ఆపైన వైభవం. నేనంటే నాతోటి అమ్మాయిలకి అసూయ. వాళ్ళు మిగతావన్నీ వదిలి నాకు చదువు బాగా రావడం లేదని ఎగతాళి చేసేవారు. దాంతో క్రమంగా వాళ్ళతో స్నేహం కట్.

నాకు పరీక్షలంటే భయం. అందుకని చదువంటే అయిష్టం. పోటీల్లేని ఆటలిష్టం. పాఠాలు కాకపోతే పాటలిష్టం.


చదువు అశ్రద్ధ చేస్తున్నానని అమ్మ తిడితే- నా బంగారు తల్లికి చదువెందుకూ- అని నాన్న ముద్దులు. నాన్న మగాడు కాబట్టి మగాళ్ళంతా బెటరే- అనుకున్నాను.

నాకు పదేళ్ళప్పుడు బావతో పరిచయమైంది. అప్పుడతడి వయసు పద్నాలుగు. బావ నాకు అమ్మ తరపున దూరపు చుట్టం. ఆ కుటుంబం అప్పులపాలై రోడ్డుపడితే- మా నాన్న ఆదుకుని ఆశ్రయమిచ్చాడు.

బావ తలిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. ఒక్కడనేకాక మగపిల్లాడని కూడా వాళ్ళింట్లో అతడికి మహా గారం. అందుకని చదువులో నాకు సరిజోడు. దానికి తోడు ముఖంలో అందం, కబుర్లుచెప్పే చందం గొప్పవి. ఆ అందచందాలు చదువుకి కాకపోయినా- నాతో స్నేహానికి పనికొచ్చాయి.

"చదువు ఉద్యోగంకోసం. గొప్పవాళ్ళకి కాదు. పదిహేడేళ్ళు ఇండియా ప్రధానిగా ప్రపంచాన్నే గడగడలాడించిన ఇందిరాగాంధీ ఇంటరైనా ప్యాసయిందో లేదో, ఇప్పుడామె జీవితకథే ఎందరికో చదువు"అంటాడు బావ. పంచతంత్రం గురించి చెబుతూ- ఒక రాజు కొడుకులు చదువొద్దు మొర్రో అంటే- విష్ణుశర్మ అనే పండితుడు చెప్పిన కథలవి అన్నాడు. అవి విన్న రాజు కొడుకులు హోదాలోనేకాక చదువులో కూడా చదువుకున్నవాళ్ళకంటే గొప్పవాళ్లనిపించుకున్నారంటే, "ఆ కథలు నాకు చెబుతావా?" అన్నాను.

"అవి ఆ కాలానికి పనికొచ్చే కథలు. ఈ కాలానికి పనికొచ్చే కథలు కూడా నాకు తెలుసు. వాటితో గొప్పవాణ్ణైపోగలననే- నేనిక చదువుమీద శ్రద్ధపెట్టడం లేదు" అంటూ బావ నాకు చెప్పినవన్నీ- గొప్పింటమ్మాయి- పేదింటబ్బాయిల ప్రేమకథలు. ప్రేమ వాళ్ళను ప్రపంచానికే గొప్పవాళ్ళని చేసింది.



"మరి గొప్పింటమ్మాయి గొప్పింటబ్బాయిని ప్రేమించదా?" అనడిగాను.

"గొప్పింటబ్బాయిలకి గర్వమెక్కువ. కూతుళ్ళని ప్రేమించినట్లు పెళ్ళాలని ప్రేమించరు. కాబట్టి వాళ్ళని ప్రేమిస్తే అమ్మయిలు సుఖపడరు" ఆ మంచి మనసు పేద అబ్బాయిలకి మాత్రమే ఉంటుందని తేల్చేసాడు బావ. అప్పుడు నేనావేశపడి ఓ పేదవాణ్ణి ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని కూడా అనుకున్నాను. బావకి చెబితే- నా ఆలోచనలు సరైన దారిలో నడుస్తున్నాయని మెచ్చుకున్నాడు. ఆ తర్వాతనుంచి తను పేదవాడినని పదే పదే నాకు గుర్తుచేయసాగాడు. పద్నాలుగేళ్ళ వయసొచ్చేసరికి నాకు బావనే ఎందుకు ప్రేమించకూడదూ అనిపించింది. ప్రేమంటే ఏమిటో స్పష్టం కావాలని- సినిమాలు శ్రద్ధగా చూసాను. పుస్తకాలు శ్రద్ధగా చదివాను. ఏంచేసినా ప్రేమ దగ్గిరకొచ్చేసరికి అది వంటికా, మనసుకా అన్న గజిబిజి పోలేదు. చివరికి క్లాస్‌మేట్సునడిగితే, "అబ్బాయిల చేతల్లో తప్ప అమ్మాయిల మాటల్లో ప్రేమ గురించి తెలియదు. ఓ బాయ్‌ఫ్రెండ్‌ని సంపాదించుకో" అన్నారు వాళ్ళు.

నాది అమ్మాయిల బడి. బాయ్‌ఫ్రెండ్స్‌కి వేరే ఆస్కారం లేదు. పోనీ ఇంట్లో బావనే బాయ్‌ఫ్రెండ్‌గా భావించాలనుకుంటే- అప్పటికి బావ వేరే ఊళ్ళో చదువుతున్నాడు. సెలవులకింటికొచ్చినప్పుడు అడుగుదామంటే- నేను పెద్దదాన్నయ్యానని- పూర్వంలా అమ్మ నన్ను అతడితో కలవనివ్వడంలేదు. ప్రేమ గురించి అడిగేటంత ఏకాంతం మాకు దొరకడంలేదు.

రెండో ప్రయత్నంలో టెన్తు ప్యాసై ఇంటర్లో చేరేసరికి నాకు పదిహేడేళ్ళు. స్త్రీపురుష బంధాల గురించి అవగాహన పెరుగుతున్నా- ప్రేమ విషయంలో మాత్రం గజిబిజి పోలేదు. నేను ఇంటర్ సెకండియర్లోకొచ్చేసరికి - బావ మకాం మళ్ళీ మా ఇంటికి మారింది. చదువైపోయి కాదు. ముగ్గురమ్మాయిల్ని ప్రేమించి గొడవలో ఇరుక్కుంటే- మా నాన్న వాళ్ళకి సద్దిచెప్పి బావకి బుద్ధి చెప్పి- వెనక్కి తీసుకొచ్చాడు.

బావ ఇప్పటికే ఎవర్నో ప్రేమించాడు కాబట్టి నేను వేరెవర్నైనా ప్రేమించాలా, లేక ముగ్గుర్ని ప్రేమించిన బావకి నాలుగో ప్రియురాలు కావాలా అన్నది తేల్చుకోలేక సతమతమౌతూ. "ఒకరు ఒకర్నేకదా ప్రేమించాలి? బావ ముగ్గుర్నెలా ప్రేమించాడు?" అనడిగాను అమ్మని. అమ్మ వెంటనే, "వాడికి ప్రేమేమిటే- వల విసిరాడంతే!" అంది కోపంగా.

అంటే బావ ఇంకా ఎవర్నీ ప్రేమించలేదని అమ్మ అభిప్రాయం. నాకు సంతోషం కలిగినా, ఆ విషయం బావ నోట విని రూఢి చేసుకోవాలనుకున్నాను. బావిప్పుడు ఇక్కడే ఉంటున్నాడు కాబట్టి- అంత పెద్ద ఇంట్లో నేను పూనుకుంటే బావని కలుసుకోవడం కష్టమే కానీ అసాధ్యంకాదు.

బావ నామాట విని, "అత్త చెప్పింది నిజమే! నేను వాళ్ళని ప్రేమించలేదు. వలే విసిరాను" అన్నాడు.

అర్థం కాలేదనుకున్నాడేమో, "వల్లో పడ్డ చేపని కోసుకు తినాలి. అక్వారియంలో పెట్టాలి, లేదా తిరిగి నీళ్ళలోకే వదిలేయాలి. నాకు జీవహింస గిట్టదు, బాధ్యత సరిపడదు. కాబట్టి- వాళ్ళని 'తిరిగి' వదిలేశాను. అందువల్ల అమ్మాయి చెడినదౌతుంది. కానీ నేను చెడ్డవాణ్ణే తప్ప చెడినవాణ్ణి అవను" అని వివరించాడు.

"చెడినవాళ్ళూ, చెడ్డవాళ్ళూ ఒకటికాదా!" అన్నాను ఆశ్చర్యంగా.

"కాదు. చెడ్డవాళ్ళలో ఆడామగా ఉంటారు. చెడేది అమ్మాయిలు మాత్రమే. చెడితే బాగుపడదు కానీ చెడ్డవాళ్ళు మంచివాళ్ళు కావచ్చు. ప్రేమించొచ్చు" అన్నాడు బావ.

నా మనసు కాస్త తేలికై, "ప్రేమంటే?"అన్నాను అసలు విషయానికొస్తూ.

బావ చటుక్కున నా చేయి పట్టుకున్నాడు. అప్పుడు నా వంట్లో ఏదో చలనం.

"ఇప్పుడు నేనేం చేసినా అభ్యంతరపెట్టవనుకో. అదే ప్రేమ" అంటూ నన్ను దగ్గిరగా తీసుకున్నాడు. నడుం మీద వేళ్ళతో రాసాడు. పెదవుల మీద ముద్దుపెట్టుకున్నాడు.

అనుభవం లేకపోయినా అదంతా దేనికి దారితీస్తుందో ఊహించగల పరిజ్ఞానముంది నాకు. ఐనా అభ్యంతర పెట్టాలనిపించలేదు సరికదా- ఆవేశంగా అతణ్ణి నా చేతుల్తో చుట్టేసాను. కానీ ఏదో చేస్తాడనుకున్న బావ చటుక్కున విడిపించుకుని, "నువ్వు నీ ప్రేమను నిరూపించుకున్నావ్" అన్నాడు.

నాలో ఏదో అసంతృప్తి, అలజడి. "ఇంకా నిరూపించుకుంటా"అన్నాను సిగ్గు విడిచి.

"ఇంతవరకూ ప్రేమ. ఈ హద్దుదాటితే అది పెళ్ళి. ప్రేమించడం పిల్లల వంతు. దీవించడం పెద్దల వంతు. నువ్వు మీ వాళ్ళని మన పెళ్ళికి ఒప్పించు. తర్వాత నీకు ప్రేమ రుచులు చూపిస్తాను" అన్నాడు బావ.

"నేనెందుకు? మా వాళ్ళని నువ్వే ఒప్పించొచ్చుగా" అన్నాను.

"ట్రాఫిక్‌లో రాంగ్‌రూట్ శిక్షార్హం. మన ప్రయత్నంలో నువ్వే రైటు" అన్నాడు బావ.

నిజమేననిపించింది. నా ప్రయత్నంగా అమ్మకి చెప్పాను- బావంటే నాకిష్టమని. అమ్మ మండిపడి, "ఇది నీకు పుట్టిన బుద్ధికాదు. ఆ జులాయి వెధవ నిన్ను రెచ్చగొట్టి, తను బాగుపడాలనుకుంటున్నాడు" అంది.

తర్వాత నాన్నకేం చెప్పిందో- ఆయన బావని ఇంట్లోంచే కాదు, ఊర్నించే తప్పించే పని చెప్పి పంపేసాడు.

ఆ తర్వాత బావ వచ్చింది మళ్ళీ నా పెళ్ళి పనులకే. ఇంటర్ అత్తెసరు మార్కులతో ప్యాసైన నెల్లాళ్ళకి నేను హనుమంతు అనే ఓ యువ రాజకీయ నేతకు భార్యనయ్యాను. నా పెళ్ళివల్ల ఇరుపక్షాలకీ రాజకీయ ప్రయోజనాలున్నాయని విన్నాను.

పెళ్ళిపనుల్లో ఉత్సాహం నటిస్తున్న బావ- ఏకాంతం దొరికినపుడు నా చేతిలో చలం 'మైదానం' పెట్టాడు.

"ఈ పుస్తకం దగ్గిరుంచుకో, ప్రేమకు సంబంధించి అసంతృప్తి కలిగినప్పుడు చదువు. కర్తవ్యం బోధపడుతుంది. నీ కర్తవ్య నిర్వహణలో నా పాత్ర నిర్వహించడానికి నేనెప్పుడూ రెడీ" అని హామీ ఇచ్చాడు.

మా ఆయన బావలా అందగాడు కాదు కానీ కురూపీ కాదు. బావకంటే ఎక్కువ కబుర్లాడుతాడు కానీ ప్రేమ తక్కువ, రాజకీయాలెక్కువ. తొలి రాత్రి మాత్రం ప్రేమ మాటలూ, చేతలతో- మధురమో కాదో కానీ- రాత్రిలో హాయిని నింపాడు. అప్పుడు ప్రేమో కాదో కానీ- ఆయనంటే ఏదో ఇష్టం పుట్టింది. తిండి, బట్ట, నగ కాక- వయసుకి తీరాల్సిన మరో లోటే ప్రేమ అనుకున్నాను. వయసు వేడి చల్లారడానికి పెద్దల ఏర్పాటే పెళ్ళి అనుకున్నాను. ఇక బావ నా మనసు లోంచి పూర్తిగా తప్పుకున్నాడు. నా తోడికోడలు కామాక్షి కలవరం రేపేదాకా నేను చాలా సంతోషంగా కూడా ఉన్నాను.

మా ఆయన అన్న రామకృష్ణుడి భార్య కామాక్షి. వయసులో ఆరేళ్ళూ, లోకజ్ఞానంలో పదేళ్ళూ నాకంటే పెద్దది. స్వసుఖంకంటే ఎదుటివాళ్ళ అసూయే ఎక్కువ ఆనందాన్నిస్తుందని ఆమె ఫిలాసఫీ. తను ఇలియానాలా ఉంటాననీ, మహేష్‌బాబులాంటి అందగాణ్ణి చేసుకోవాలనీ కలలు కనేదిట. డబ్బుకాశపడిన పెద్దలామె మెడలు వంచి ఆలీ టైపులో ఉండే మా బావగారు రామకృష్ణుడితో పెళ్ళిచేసారు. తనమీద ఎవరూ జాలిపడకూడదనో ఏమో- ఆమె తన భర్త గురించి, 'నాకే కట్టుబడిన రాముడు. ఏకాంతంలో అలరించే కృష్ణుడు. ఆయనకి తలిదండ్రులు తగిన పేరే పెట్టారు. ఆయనో గొప్ప రొమాంటిక్ హీరో' అంటుంది. ఆమె నాకు చెప్పే మదన మనోహరాలు సినిమాల్లో చూసినట్టూ, పుస్తకాల్లో చదివినట్లూ అనిపిస్తాయి.

> **ఈ** పుస్తకం దగ్గిరుంచుకో, ప్రేమకు సంబంధించి అసంతృప్తి కలిగినప్పుడు చదువు. కర్తవ్యం బోధపడుతుంది. నీ కర్తవ్య నిర్వహణలో నా పాత్ర నిర్వహించడానికి నేనెప్పుడూ రెడీ

"ఇంకా చదువుకో" అన్నారాయన. కానీ పత్రిక తీస్తే ఆయన, టీవీ చూస్తే ఆయన. మర్చిపోవడానికి ఒకటా రెండా- ఎన్నో చిలిపి చేష్టలాయనవి. క్లాసు పుస్తకాలు చదవడం నావల్లకాదని గ్రహించి ఇలా సెటిలైపోయాను. పెళ్ళై నాలుగేళ్ళైనా ఇంకా 'ఆ జీవితం' మొహం మొత్తలేదు" అందామె నాతో.

అవన్నీ రొమాంటిక్ ఊహలే తప్ప నిజాలు కాకపోవచ్చు. కానీ నిజం చేసుకోవడం అసాధ్యం కాదుగా! నాకూ మనసై మా ఆయనకు చెబితే, "సాని కబుర్లు చెబుతున్నావ్- కాల్‌గర్ల్ ఔదామనుకుంటున్నావా?" అన్నాడు.

అప్పుడు తెలిసింది నాకు- ఊళ్ళకి వెళ్ళినప్పుడు కాల్‌గర్ల్స్‌తో ఆయనకు మామూలని. ఆశ్చర్యంగా అది తప్పన్న భావం ఆయనకే కాదు, నాకూ కలగలేదు. 'ఆ జీవితం' కాల్‌గర్ల్స్‌నుంచి పొందుతూ నన్ను తనకి వారసుల్ని కనిచ్చే యంత్రంలా చూస్తున్నాడు. మనిషిలా ఉండాలంటే- నాకూ ఓ కాల్‌బాయ్ అవసరమేమో! అప్రయత్నంగా బావ గుర్తుకొచ్చాడు. అతడిచ్చిన 'మైదానం' గుర్తుకొచ్చింది. అంతకాలం మూలపెట్టిన ఆ పుస్తకం చదివితే - అందులో మా ఆయనలాంటి ఓ ప్లీడరు. ఆయనకు భార్యగా నాలాంటి ఓ రాజేశ్వరి.

"ఒక్క నిముషం వదలలేని ప్రేమననుభవించడం కన్నా అదృష్టమేముంది స్త్రీకి?" అనుకుంటూ ఆ రాజేశ్వరి ఓ అమీర్‌తో లేచిపోయింది. నేనూ అలా చేస్తే! బావ నాకిస్తానన్న సహకారం అదేనేమో!

నా భర్త నావి సాని కబుర్లన్నాడు కానీ- స్పందన లేని తనువుల కలయిక 'సాని మేళం' కాదా?


నాకు బావ బిగి కౌగిలి, దానికి ముందు అతడి మాటలు, చేతలు గుర్తుకొచ్చాయి. ప్రేమంటే అదేనా, బావని కాదని నేను తప్పుచేసేనా అని నాలో సందిగ్ధం. ఏదేమైనా ఒక నిర్ణయం తీసుకునేముందు ఆయనకింకో అవకాశమివ్వాలనుకుని ఒక రాత్రి, "నాకు ప్రేమకావాలి" అని నొప్పించానాయన్ని.


అదోలా చూసి, "నిన్న ఇచ్చేగా" అన్నాడాయన.

గుర్తొచ్చింది. నిన్న రాత్రి ఎముకలు విరిగేటంత బలంగా కౌగలించుకున్నాడు. అన్నార్తుడు ఆకలి తీర్చుకునే ఆత్రం చూపాడు. వంటికి కడుపు నిండిన సుఖమే తప్ప- స్పందన లేదు. అదే బావైతే?

"ప్రేమంటే అదికాదు. కాసేపు జోక్సు. కాసేపు గతం ముచ్చట్లు. కాసేపు నేటికబుర్లు. తర్వాత చిలిపి చేష్టలు..." నేను చెబుతుంటే. "ఐతే వెళ్ళి టీవీ చూడు" అన్నాడాయన. ఇంకా ఏదో అనబోతే, "పార్టీ మారుతున్నాను. చాలా పెద్ద నిర్ణయమిది. నన్నో నెల్లాళ్ళు వదిలేయ్. కావాలంటే అప్పుడు ప్రేమ గురించి మాట్లాడుకుందాం"అని పక్కమీద వాలి సాలోచనగా కళ్ళుమూసుకున్నాడు.

(మిగతా 27 పేజీలో)



(19వ పేజీ తరువాయి)

ఆయన పార్టీ మారడం నిజమే. అది మా నాన్నకిష్టం లేదు. ఇద్దరికీ చిన్న గొడవ. ఫలితంగా కొన్నాళ్ళు నేను పుట్టింట్లో. అక్కడ నాకేం తోస్తుంది? ఆరోగ్యం బాగోలేదంటే గాలి మార్పుకీ, మానసికోల్లాసానికీ ఓ హిల్ స్టేషన్‌కి పంపించాడు నాన్న- బావని తోడిచ్చి.

నాన్న ఉద్దేశ్యం నాకు తెలియదు కానీ- బావతో నేను కోరుకున్న ఏకాంతం లభించింది. మా ఆయన గురించి అన్నీ బావకి చెప్పుకున్నాను. బావ నా మానసిక స్థితి అర్థంచేసుకున్నాడు. నా నిర్ణయాన్ని సమర్థించాడు. నా మనసుకి నచ్చేలా ప్రవర్తించాడు. అతణ్ణి కాల్‌బాయ్‌గా భావించిన నాలో అపరాధ భావం ఏ కోశానా లేదు. కానీ హద్దులు దాటడానికి సంకోచిస్తూ, "ఇలాచేస్తే మన గురించి లోకం ఏమనుకుంటుంది?" అన్నాను. "మనిషికున్న సదుపాయాలన్నీ ఉండాలి. మనసుకేం నచ్చితే అది చేయడానికి జంతువుకున్నలాంటి స్వేచ్ఛ ఉండాలి. ఈ ఫిలాసఫీని నమ్మినవారికి లోకంతో పనిలేదు" అన్నాడు బావ.

పగలే రాత్రిగా రాత్రే పగలుగా గడిచిన మా కొత్త కాపురంలో - ఓ నెల్లాళ్ళిట్టే గడిచిపోయాయి. ఈలోగా నాకు మా ఆయన్నించి కబురొచ్చింది వెంటనే బయల్దేరి రమ్మని. అది అల్టిమేటం కావడంతో- బావ నాన్నతో ఫోన్లో మాట్లాడేడు. ఆయనేం చెప్పాడో కానీ నన్ను అత్తింటికి వెళ్ళమని సుద్దులు చెప్పాడు బావ.

"నేను వెళ్ళను. కలకాలం మనమిలాగే కలిసుందాం" అన్నాను మొండిగా.

"మీ ఆయన మంచాడు. అనుమానించకుండా నిన్నేలుకుందుకు సిద్ధంగా ఉన్నాడు. నా దగ్గిర నువ్వు బావుకునేదేముంది? నీ ఏటీఎం మీద రోజులు సుఖంగా వెళ్ళిపోతున్నాయి. నీ అకౌంట్లో బ్యాలన్సు నిల్లయ్యేక మన గతేమిటి?" అన్నాడు బావ వాస్తవానికొస్తూ.

"అదీ నిజమే- ఇలా ఎన్నాళ్ళు? డబ్బు సంపాదించే మార్గం చూడు" అన్నాడు.

"డబ్బు సంపాదించేవాళ్ళు హనుమంతులు. ప్రేమికులు కాదు" అన్నాడు బావ నిర్లక్ష్యంగా.

'డబ్బే కాదు- అదొక్కటే ముఖ్యమనుకుంటే ప్రేమ కూడా వెగటే. రెండూ బ్యాలన్స్ చేయకపోతే- నువ్వు ప్రేమ హనుమంతువౌతావు" అన్నాను కాస్త చిరాగ్గా.

"నీకేం- నువ్విలాగే ఆలోచిస్తావ్! ఇంకా నువ్విక్కడే ఉంటే- నా ప్రాణాలకే ముప్పు, తెలుసా?"అంటూ బావ తన అసలు భయం చెప్పాడు.

"నేనుండగా నీ వంటి మీద ఈగ వాలనివ్వను" ధైర్యం చెప్పాడు.

బావ ఒప్పుకోలేదు, "సమాజం దృష్టిలో మన సంబంధం అక్రమం. అది సక్రమం కావాలంటే మీ ఆయన నీకు విడాకులివ్వాలి. ఆయన నీకు విడాకులివ్వాలంటే- నీకు నాకంటే బలమైనవాడి ఆశ్రయం కావాలి. కొన్నాళ్ళు బ్రహ్మచారి దగ్గిరుండడం నీకిష్టమేనా?" అన్నాడు.

బావ చెప్పింది అర్థంచేసుకుందుకు కాసేపట్టింది నాకు. బ్రహ్మచారి వయసు నలభై. పెళ్ళి చేసుకోలేదు. చేసుకునే ఉద్దేశ్యం కూడా లేదు. అంగబలం, అర్థబలం ఉంది కాబట్టి తాళి కట్టని శయనేషు రంభలకు లోటు లేదు. ఆయనకి నామీద మోజు పుట్టింది. ఒప్పుకుంటే నన్ను హంసతూలికా తల్పంపై పవళింపజేసి పాదసేవ చేస్తూ, నా పాదతాడనాన్ని 'అది నాకు మన్ననయ'అనడానికి సిద్ధంగా ఉన్నాడు. ఆయన మా ఆయనకి పొలిటికల్ రైవల్ కాబట్టి- నాకప్పుడు విడాకులు ఖాయం. అప్పుడు బావ నాతో పెళ్ళికి సిద్ధం.

చలం 'మైదానం'లో రాజేశ్వరి గుర్తుకొచ్చింది నాకు. ప్లీడరు పెనిమిటినుంచి అమీర్. అక్కణ్ణించి మీరా. నేను హనుమంతునుంచి బావ. అక్కణ్ణించి బ్రహ్మచారి. ఆ తర్వాత మళ్ళీ బావను చేరగల మనస్థితి నాకుంటుందా? నాకు తెలియకుండానే నేను పతనమైపోతున్నానా?

నా భయం విన్న బావ, "ఇంతవరకూ నీది పతనం కాకపోతే ఇకముందూ కాదు" అన్నాడు.

నిజమే! అనేకమంది కాల్‌గర్ల్స్ ఉన్న ఆయనకి రాని పతనం- రెండో కాల్‌బాయ్‌తోనే వచ్చేస్తుందా నాకు?

నేను బ్రహ్మచారి ఇంటికి మారాను. అక్కడ నన్నాయన మహారాణిలా గౌరవించాడు. శృంగార దేవతలా ఆరాధించాడు. తటపటాయించే నాతో, "ఇది స్వర్గం. ఇక్కడ శృంగారానికి వావి వరుసలుండవు. తప్పొప్పులుండవు. ఐహిక సుఖాలపై విరక్తికలిగినవారు కూడా ఈ స్వర్గ సుఖాన్నాశించే కఠోర తపస్సుచేస్తారు. అలాంటి స్వర్గం మనకి అవలీలగా లభించింది" అంటూ ప్రోత్సహించాడు.

ఆయన మాటల్లోచేతల్లో నేను నిజంగా స్వర్గాన్నే చూసాను.

అలా ఓ రెండునెలలు కలలా గడిచిపోయాయి. నేను బావని పూర్తిగా మర్చిపోయాను.

ఒకరోజున బ్రహ్మచారి నాతో, "నువ్వొక అద్భుతానివి. నీ సాంగత్యం నా అదృష్టం. నేను నీ నుంచి పొందుతున్న ఆనందం నన్ను ఋణగ్రస్థుణ్ణి చేస్తోంది. ఋణభారం రోజురోజుకీ పెరిగిపోతుంటే- నా ఉత్సాహం మునుపటిలా లేదు. ఆలోచించగా ఆలోచించగా ఋణ విముక్తికి తిరుగులేని ఉపాయం తట్టింది" అన్నాడు.

ఏమిటో అనుకున్నాను. ఆరోజు సాయంత్రం నన్నాయన కార్లో తీసుకెళ్ళి మా అత్తారింట్లో దిగబెట్టాడు.

ఆయనకి నన్నప్పజెబుతూ, "గాలి మార్పుకి చెల్లెమ్మని ఇంతకాలం మా ఇంట్లో ఉంచినందుకు కృతజ్ఞతలు. తనని నేను కంటికి రెప్పలా చూసుకున్నాను. ఇప్పుడు తన ఆరోగ్యం పూర్తిగా కుదుటపడింది" అన్నాడు.

స్వర్గంలో వావివరసలుండవంటే అప్పుడర్థమైంది నాకు. మా ఆయన కూడా నవ్వుతూ తనూ బ్రహ్మచారికి కృతజ్ఞతలు తెలిపాడు. నన్ను పల్లెత్తు మాటనకుండా నవ్వుతూ స్వీకరించాడు. సాయంత్రం వాళ్ళిద్దరూ కలిసి పార్టీ కార్యాలయానికెళ్ళారు.

అప్పుడు నేను బావకు ఫోన్‌చేసి జరిగింది చెప్పాను. "అంతా నీ మంచికే. పార్టీ మారిన మీ ఆయన్ని మళ్ళీ పార్టీలోకి రప్పించడానికి నిన్నో పావుగా వాడుకున్నాడు బ్రహ్మచారి. పొలిటికల్ రైవల్సిద్దరూ ఇప్పుడు ప్రాణ స్నేహితులయ్యారు. ఈ తతంగం వెనుక మీ నాన్న నిర్వహించిన పాత్ర కూడా విశిష్టమైనది. ఇలాంటి పరిస్థితుల్లో నువ్వూ, నేనూ ఎక్కడివాళ్ళమక్కడుండడమే మంచిది" అన్నాడు బావ.

"మనిషికున్న సదుపాయాలన్నీ ఉండాలి. మనసుకేం నచ్చితే అది చేయడానికి జంతువుకున్నలాటి స్వేచ్ఛ ఉండాలి. ఆ ఫిలాసఫీ మర్చిపోయావా" అన్నాను.

"మనిషి మనిషిలాగే ఉండాలి. జంతువులా మారితే వేటకి సిద్ధపడాలి. నాది వల అంటారు.నీకు మదపిచ్చి అంటారు. ఎందుకొచ్చిన గొడవ?" అన్నాడు బావ హెచ్చరికగా, స్వానుభవంతో విశ్లేషిస్తే- కనీసం కొంతకాలం అతడి మాటకి విలువివ్వాలనిపించింది.

కానీ మనిషిలాగే ఉన్నా వేట ఆగుతుందా? టీవీలో మా ఆయన పార్టీ మార్పిడి ప్రత్యక్ష ప్రసారంగా చూస్తూండగా కామాక్షి నా భుజం తట్టి, "వ్యభిచారమో, రాజకీయమో- నువ్విలా వెనక్కి రావడాన్ని ఏమనాలంటావ్?" అని అక్కసుగా అడిగింది.

బదులివ్వడానికి తడబడ్డాను. కానీ సరిగ్గా అప్పుడే టీవీలో, "ఇందులో చిన్నతనమేముంది? నాది జస్ట్ హోం కమింగ్" అన్నారాయన పత్రికా విలేకరులతో.

నేను వెంటనే, "ఆయన మాటే నా మాట. వ్యభిచారమో, రాజకీయమో- నాది హోం కమింగ్?" అన్నాను. ★

**రచయిత్రి చిరునామా:**
**జె.రామలక్ష్మి**
శ్రీ వాణి గిరిజ నిలయం,
63 సాకేత్ ఫేజ్ 1, కాప్ర, ఇసిఐఎల్ పోస్ట్,
హైదరాబాద్- 500062.

